అధ్వానం... పొలాల రస్తాలు!

- సాగుకు ఇబ్బందులు పడుతున్న రైతులు
- వర్షాకాలంలో రాకపోకల ఇబ్బందులు వర్ణనాతీతం
- పంటల దిగుబడులు ఇంటికి తరలించాలంటే నరకరమే



పారువేట మండపం వైపు పొలాలకు వెళ్లే రస్తా దుస్థితి



మూలోల్ల కుంట వైపుకు వెళ్లే పొలాల రస్తా ఇలా....

మిడుతూరు: గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ప్రత్యేకించి పొలాల రస్తాలు అస్తవ్యస్థంగా మారాయి. దీంతో రైతులు సాగుకు ఇబ్బందులు పడుతున్నారు. మిడుతూరుతోపాటు గ్రామాల్లో రైతులు పొలాలకు వెళ్లేందుకు కష్టపడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షకాలంలో ఈ సమస్యలు మరీ ఎక్కువ. పంటల దిగుబడులు ఇళ్లకు చేర్చుకునేందుకు నరకం చూస్తున్నారు అన్నదాతలు. మండల కేంద్రం మిడుతూరు నుంచి సమీప గ్రామాల పొలాలకు వెళ్లేందుకు రహదారులు సరిగ్గాలేక రైతులు, వ్యవసాయ కూలీలు పడరానిపాట్లు పడుతున్నారు. మిడుతూరు నుంచి బరక పొలాలకు వెళ్లే రహదారి (మిడుతూరు నుంచి పారువేట మండపం వైపు, బ్రహ్మం గారి మఠం నుంచి మూలోల్ల కుంట వైపు వెళ్లే పొలాలు) పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. అదేవిధంగా మిడుతూరు నుండి బక్కిరెడ్డి కుంట, సుంకేసుల గ్రామం వైపు పొలాల రస్తా, కాకిలేరు దాటిన తర్వాత పొలాల రస్తాలు పూర్తి అధ్వానంగా మారాయి. దీంతో సాగుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా మిడుతూరుతోపాటు వీపనగండ్ల, సుంకేసుల, జలకనూరు, చింతలపల్లి, దేవనూరు, పీరుసాహెబ్ పేట, మాసపేట, కలమందలపాడు, చౌట్కూరు, 49- బన్నూరు, చెరుకుచెర్ల, తలముడిపి, నాగలూటి తదితర గ్రామాల్లో పొలాలకు రస్తాలు సరిగా లేనందున ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పొలాల రహదారుల సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంటలు చేతికొచ్చినా పొలంలోనే....

మండల కేంద్రం మిడ్తూరుతోపాటు సమీప గ్రామాల్లో దాదాపు ఎనిమిదివేల ఎకరాల సాగు భూమి ఉంది. ఈయేడు మొక్కజొన్న, కంది, కొర్ర, పొగాకు ఎక్కువగా సాగు చేశారు. ఎద్దులు బండ్లు సైతం వెళ్లలేని విధంగా ఉన్నాయి రస్తాలు. వర్షాకాలం పొలాలకు వెళ్లలేం అన్నట్లు ఉంటుంది. రహదారులు బురదమయంగా ఉంటాయి. కొన్నిచోట్ల కుంటలను తలపిస్తుంటాయి. ప్రస్తుతం తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పొలం రస్తాలు జలమయం అయ్యాయి. మొక్కజొన్న చేతికొచ్చినా దిగుబడులు తరలించలేనందును కోతలు చేపట్టలేదు.

నరకం చూస్తున్నాం..



పొలాలకు వెళ్లే రస్తాలు అద్వానంగా ఉండటంతో నిత్యం నరకం చూస్తున్నాం. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాం. చేసేదేమి లేక అష్టకష్టాలు పడుతూనే పొలం పనులకు వెళ్తున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టిసారించి పొలాలకు వెళ్లే రస్తాలు బాగు చేయాలి.

–ధర్మారెడ్డి, యువరైతు , మిడుతూరు

ఉపాధి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు..



ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాల్లో పొలాలకు వెళ్లే రస్తాల సమస్యలను లేవనెత్తుతూనే ఉన్నాం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రస్తాలను చేపట్టాలని అధికారులను సర్పంచ్‌లు కోరినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పొలాలకు వెళ్లే రస్తాలను బాగు చేయించాలి.

–మండల ఉపాధ్యక్షుడు , నబిరసూల్, నాగలూటి గ్రామం

సమస్య పరిష్కారానికి చర్యలు ..



గ్రామ సభలలో పొలాల రస్తాలను బాగు చేయాలని రైతులు మా దృష్టికి తీసుకోచ్చారు. పొలాల రహదారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. పొలాలకు వెళ్లే రస్తా 6 లేక 5 మీటర్లు ఉంటే రెండు వైపుల మీటరు చొప్పున మట్టిని తవ్వి రస్తా చదును చేస్తాం. నాలుగు మీటర్లు ఉంటే వేయాడానికి నిబంధనలు వర్తించవు. గ్రావెల్ వదిలి రస్తాలు చేయడానికి అనుమతుల కోసం ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్తాం.

–ఏపీఓ జయంతి

క్లుప్తంగా

రహదారి జలమయం



రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు

బండిఆత్మకూరు: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి పార్నపల్లె గ్రామంలోని రహదారి జలమయమైంది. డ్రైనేజీ నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్ల చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు చేరుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేలవాలిన వరి పైరు



తమ్మడపల్లె సమీపంలో నేలవాలిన పైరు

మహానంది: అల్పపీడన ప్రభావంతో కొద్ది రోజులుగా భారీ వర్షాలతో పాటు గాలులు వీస్తున్న విషయం తెలిసిందే. వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మహానంది మండలం తమ్మడపల్లె గ్రామ పరిసరాల్లో సాగు చేస్తున్న వరి పంట నేలవాలింది. తమకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని రైతులు శివయ్య, ప్రతాపరెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి సాక్షితో మాట్లాడుతూ ఇప్పటి వరకు మహానంది మండలంలో ఎలాంటి పంట నష్టం జరగలేదని చెప్పడం గమనార్హం.

కర్రలకు గొడుగులెట్టినట్లు..!



అబ్బీపురం వద్ద కనిపించిన తిక్క పుట్టగొడుగులు

మహానంది: గొడుగులంటే గొడుగులు కాదు, పుట్టగొడుగులంటే తినేవి కాదు. పల్లెటూర్లలో తిక్క పుట్టగొడుగులుగా పిలిచే ఈ పుట్టగొడుగులను చూస్తే కర్రలకు గొడుగులు పెట్టినట్లు కనిపించాయి. సాధారణంగా పుట్టగొడుగులు ఉరుములు, మెరుపులు వచ్చినప్పుడు వాటికవే పుట్టుకొస్తాయి. అల్పపీడన ప్రభావంతో గత రెండ్రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పాటు గురువారం ఉరుములు, మెరుపులు వచ్చాయి. దీంతో ఇలా ఇవి బయటికి రాగా సాక్షి కెమెరాలో బంధించింది.

పల్లకీపై మహానందీశుడి విహారం



పల్లకీలో విహరిస్తున్న స్వామివారు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామికి శుక్రవారం రాత్రి పల్లకీసేవను వైభవంగా నిర్వహించారు. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు చెండూరి రవిశంకర అవధాని, ఆంజనేయశర్మ, నాగేశ్వరశర్మ స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో కొలువుదీర్చారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజలు శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకీ సేవను నిర్వహించారు.

వంద రోజుల పని దినాలు కల్పించాల్సిందే



మాట్లాడుతున్న జిల్లా అధికారి జనార్దన్‌రావు

వెలుగోడు: జాతీయ ఉపాధి హామీ పథకం కింద 100 రోజుల పని దినాలు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జనార్దన్‌రావు అధికారులకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పనులపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. 200 రోజుల యాక్షన్ ప్లాన్, 100 రోజుల పనిదినాలు పూర్తి, షోక్ పిట్స్, క్యాటిల్ షెడ్స్, పల్లె వనాలు, హౌసింగ్, పంచాయితీ రాజ్ పనులపై నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్స్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో దృష్టిలోపం నివారించవచ్చు



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: పౌష్టికాహారం తీసుకుంటే దృష్టి లోపాలను నివారించవచ్చునని కంటి వైద్యులు షేక్షావలి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గువ్వల కుంట్ల గ్రామం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నందు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉశేనయ్య, ఉపాధ్యాయులు నిజాముద్దీన్, అలీ, రుక్మిణి, ఏఎన్ఎం సరిత పాల్గొన్నారు.

తగ్గిన మొక్కజొన్న పంట దిగుబడి



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న డీఎస్ఓ

జూపాడుబంగ్లా: అధికారులు నిర్వహించిన పంటకోత ప్రయోగంలో మొక్కజొన్న పంట తగ్గినట్లు వెల్లడైంది. శుక్రవారం మండలంలోని తంగడంచ రెవెన్యూ గ్రామంలోని సర్వేనెంబర్ 114లోని ఈదుల ప్రమీలమ్మకు చెందిన 1.10ఎకరాల్లో డీఎస్ఓ నాగరాజశర్మ, ఏఎస్ఓ హనుమంతు పంటకోత ప్రయోగం నిర్వహించారు. చుట్టూ ఐదుమీటర్ల కొలతల్లో అధికారులు పంటకోత ప్రయోగం నిర్వహించగా 22కిలోలు వచ్చినట్లు తెలిపారు. మూడు కిలోలు తగ్గినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తంగడంచ వీహెచ్ఏ వెంకటేశ్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

అనుమతులున్న బయోమందులనే విక్రయించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

కొత్తపల్లి: అనుమతులు ఉన్న బయోమందులనే విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని బావాపురం గ్రామ సమీపంలో ఉన్న జేసీ అగ్రి బయోటెక్ మ్యాన్ ఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ఆయన తనిఖీ చేశారు. ముందుగా యంత్రాల పనితీరు, లాబ్ రిజిస్టర్‌లను, బయో ఉత్పత్తుల తయారీని పరిశీలించారు. రిజిస్టర్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో రూ.47400 విలువ బయోఉత్పత్తుల నిలువలకు చెందిన అమ్మకాలను నిలిపి వేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు ఆంజనేయ, మండల వ్యవసాయాధికారి కె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ

వెలుగోడు: పట్టణంలోని రైతు సేవా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వీబీఎస్–8 రకం మినుము విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఆయన వెంట ఏడీ ఆంజనేయ, మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ఆత్మకూరు: మండలంలోని మల్లికార్జున ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో ఎరువులు, పురుగు మందులను శుక్రవారం నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి వై.వి.మురళీకృష్ణ, సహాయ వ్యవసాయ సంచాలకులు బి.ఆంజనేయ తనిఖీ చేశారు. డీలర్లు తమ వద్ద ఉన్న స్టాక్‌ను అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు సులభంగా లెక్కించే విధంగా స్టోర్ చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. ఎరువులను ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట టెక్నికల్ ఏఓ కళ్యాణ్, మండల ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి

పాములపాడు: ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీక్రిష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రతా మిషన్, పీఎం కిసాన్ పథకాల గురించి రైతులకు వివరించాలని సూచించారు. అనంతరం ఇటీవల కురుస్తున్న వర్షాల వలన వేంపెంట గ్రామంలో దెబ్బతిన్న పైర్లను పరిశీలించారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు. సమావేశంలో ఏడీఏ ఆంజనేయ, మండల వ్యవసాయ అధికారి ఫణీశ్వరరెడ్డి, ఏఓ కళ్యాణ్, ఏఈఓ మద్దిలేటి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పనులను అడ్డుకున్న రైతులు



తహసిల్దార్ శ్రీనివాసులుతో మాట్లాడుతున్న పైపాలం గ్రామస్థులు

మిడుతూరు: మండల పరిధిలోని పైపాలం గట్టు ప్రాంతంలో చేపడుతున్న సోలార్ పనులను నిలిపివేయాలని పైపాలం సర్పంచ్ రామచంద్రుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు తహసీల్దార్ శ్రీనివాసులు సమక్షంలోనే శుక్రవారం సోలార్ ప్రాజెక్టు ప్రతినిధులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 1978 సంవత్సరంలో పంచాయతీ ఏర్పడిందని, 2002 సంవత్సరంలో రెవెన్యూ డివిజన్ అయిందన్నారు. మా గ్రామ పంచాయతీ తీర్మానం చేయకుండా, ప్రజల అభిప్రాయ సేకరణ చేయకుండా ఏ విధంగా సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తారని వారిని సర్పంచ్, గ్రామస్తులు నిలదీశారు. నాగలూటి, మాసపేట గ్రామ పంచాయతీ తీర్మాణాలు చేశారని, ఆ సర్వే నంబర్‌లలో సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకోవచ్చని, మా ప్రాంతంలో సోలార్ ప్రాజెక్టు పనులు నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో పైపాలం గ్రామస్తులు జగన్ మోహన్ రెడ్డి, నాగేశ్వరరెడ్డి, శివమూర్తి, రామలింగేశ్వరరెడ్డి, ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదసాగా సాగింది. ముందుగా వివిధ శాఖల అధికారులు వారి నివేదికలను చదివి వినిపించారు. అయితే ప్రజల సమస్యల గురించి ప్రజా ప్రతినిధులు ఎవ్వరూ ప్రస్తావించలేదు. ప్రధానంగా ఇటీవల కురుస్తున్న వర్షాల మూలంగా చాలా మంది రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది. అయినా ఎవ్వరూ ఆ ఊసే ఎత్తలేదు. అధికారులు వారి నివేదికల్లోని విషయాలను చదివి వినిపించడంతో సమావేశాన్ని ముగించారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, ఏఓ ఫణీశ్వరరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

ఆత్మకూరు: జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జవహర్‌నాయక్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీశైలం నియోజకవర్గంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు అధికంగా ఉన్నాయన్నారు. ఇందులో శ్రీశైలం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 1 నుంచి 8వ తరగతి వరకు 87 మంది విద్యార్థులు ఉన్నారని, అయితే ఇక్కడ ఒకే ఉపాధ్యాయురాలు విద్యాబోధన చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, జీవశాస్త్రం సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. శివపురం చెంచుగూడెంలోని ఆశ్రమ పాఠశాలల్లో 140 మంది విద్యార్థులు ఉన్నారని, సబ్జెక్టు ఉపాధ్యాయులు లేరని చెప్పారు.

మహానంది ఈశ్వర్‌నగర్‌లో ఉద్రిక్తత

మహానంది: మహానంది ఈశ్వర్‌నగర్ కాలనీలోని శ్రీకాశిరెడ్డినాయన ఆశ్రమం సమీపంలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎన్నో ఏళ్లుగా ఉన్న నాగుల కట్ట స్థలం మాదంటూ అయన్ననగర్ గ్రామానికి చెందిన రామాంజనేయులు స్థలం వద్దకు వెళ్లి అక్కడ ఉన్న విగ్రహాలను తొలగించడం వివాదాస్పదమైంది. కాలనీ వాసులు అందరూ కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, పోలీసులు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. విషయాన్ని తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. రెవెన్యూ అధికారుల విచారణలో పూర్తి వివరాలు తెలుస్తాయని చెప్పారు.

పరిశుభ్రమైన మంచినీటిని అందించాలి

నందికొట్కూరు: ప్రట్టణ ప్రజలకు పరిశుభ్రమైన మంచినీటిని అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఇంజినీరింగ్ సెక్షన్ ఏఈ మనోజ్‌కుమార్ రెడ్డికి ఏపీ రైతుసంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఏబీఎం పాలెం, ఇందిరానగర్, సీఎస్ఐ పాలెం, మారుతి నగర్, హాజనగర్, వాల్మీకి నగర్, వడ్డేపేట, గాంధీ నగర్ తదితర కాలనీలో రెండురోజులుగా కలుషితమైన నీరు వస్తుందని, పరిష్కార చర్యలు తీసుకోవాలని జిల్లా నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు ఏఈని కోరారు.

రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధిలో సీసీ రోడ్ల నిర్మాణాలు ఎంతో దోహదపడతాయని నియోజకవర్గ ప్రత్యేక అధికారి చింతామణి, ఎంపీడీవో మేరీ, తహసిల్దార్ ఉమారాణి, ఎంపీపీ కుసుమలత అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కొత్తపల్లితోపాటు దుద్యాల, శివపురం గ్రామాలలో సర్పంచుల ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించారు. సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమాలు చేశారు. ఆయా కార్యక్రమాలలో సర్పంచులు లక్ష్మీదేవి, చంద్రశేఖర యాదవ్, పంచాయతీ కార్యదర్శులు చిన్నస్వామి, అనూష, అజ్మతున్నీసా పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి చింతామణి సూచించారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో శిక్షణా తరగతులు ఎంపీడీవో మేరీ అధ్యక్షతన నిర్వహించారు.

పాములపాడు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని వేంపెంట గ్రామంలో సర్పంచ్ మాణిక్యమ్మ సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ విమలమ్మ, జేఈ రాఘవేంద్రప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని పారుమంచాల గ్రామంలో అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాశం, మాజీ ఎంపీపీ మండడి వెంకటరమణారెడ్డి, పీఆర్ ఏఈ బషీర్, ఏపీఓ గౌరీబాయి పాల్గొన్నారు.

మిడుతూరు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని జలకనూరులో సర్పంచ్ కురువ ఎల్లయ్య ఆధ్వర్యంలో సీసీ రోడ్లకు ఎంపీడీఓ దశరథరామయ్య శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. పీఆర్ ఏఈ ప్రతాపరెడ్డి, ఏపీఓ జయంతి, పంచాయతీ కార్యదర్శి షఫీ అహ మ్మద్, గ్రామ నాయకులు శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యాన పంటలు సాగుకు ప్రోత్సాహకం



పూలతోటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారిణి తేజశ్విని

జూపాడుబంగ్లా: ఉద్యానవన పంటలు సాగుచేసుకొనే రైతులకు ప్రభుత్వం రాయితీలిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు హార్టికల్చర్ అధికారిణి తేజశ్విని తెలిపారు. శుక్రవారం ఆమె మండలంలోని తంగడంచ గ్రామంలోని నర్సరీలు, పూలతోటల సాగును పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పూలతోటలు సాగుచేసుకొనే రైతులకు హెక్టారుకు (2.5ఎకరాలకు) రూ.16వేల చొప్పున రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. జామ, దానిమ్మ, మామిడి, డ్రాగన్‌ఫ్రూట్స్, చీని, నిమ్మ పండ్లతోటలను డ్రిప్ పద్ధతిలో సాగుచేసుకొనే రైతులకు 40శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. హైబ్రీడ్ రకాలైన కూరగాయల తోటలను డ్రిప్ పద్ధతిలో సాగుచేసుకునే రైతులకు హెక్టారుకు రూ.20వేల రాయితీ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో తంగడంచ వీహెచ్ఏ వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు రోడ్డును ఏర్పాటు చేయాలి

కొత్తపల్లి: గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు రోడ్డును ఏర్పాటు చేయాలని సమతసైనిక్‌దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు సగినెల సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని ఎదురుపాడు ప్రాథమికోన్నత పాఠశాల రోడ్డును విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి పరిశీలించారు. రోడ్డు అధ్వానంగా ఉందని, అధికారులు స్పందించి పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరారు.

పంచాయతీ పాలనపై శిక్షణ

పగిద్యాల: గ్రామ పంచాయతీ పాలనపై వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్‌లు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ సుమిత్రమ్మ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం వార్డుమెంబర్లు, ఉప సర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీఓ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా జెడ్పీటీసీ పుల్యాల దివ్య హాజరయ్యారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉపసర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను ఎంపీడీఓ దశరథరామయ్య ప్రారంభించారు. పంచాయతీల పరిపాలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సంజన్న, ట్రైనర్స్ అనురాధ, వీరారెడ్డి, పవన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే షాప్ సీజ్ చేస్తాం



రికార్డులు పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు

జూపాడుబంగ్లా: ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తే దుకాణాలను సీజ్‌చేస్తామని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు హెచ్చరించారు. శుక్రవారం ఆయన జూపాడుబంగ్లాలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైవే, నేషనల్‌హైవే రోడ్లకు 220మీటర్ల దూరంలో మద్యం దుకాణం నిర్వహించుకోవాలన్నారు. బడి, గుడి, చర్చి, మసీదు లకు 100మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండాలన్నారు. నందికొట్కూరు, పగిద్యాల, మిడ్తూరు, జూపాడుబంగ్లా మండలాల్లో 10 మద్యం దుకాణాలుండగా వాటిల్లో 8దుకాణాలకు 15రోజులపాటు తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేసి ప్రారంభించామన్నారు. మద్యం దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

పాములపాడు: ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఎం నాయకులు స్థానిక సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి సామన్న మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాలు పాటిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై రూ.8163 కోట్ల భారం మోపబోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలయ్య, రమణ, నారాయణ, పురుషోత్తం, ఆనంద్‌గౌడు, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: పెంచిన చార్జీలు రద్దు చేసేంతవరకు పోరాడతామని సీపీఎం నాయకులు పక్కిరి సాహెబ్ హెచ్చరించారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ ఏడీఏ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంట్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం బాదుడే బాదుడు కార్యక్రమాన్ని మొదలు పెట్టిందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకుంటే ప్రజలను సమీకరించి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఏడీఏ శ్రీనివాసులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, బాబు, రషీద్, గణేష్, జావీద్, కరిముల్లా, పాండు, కలాం, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయంపై నిరసన

బండిఆత్మకూరు: ట్రూఅప్, సర్దుబాటు పేరుతో సామాన్యులపై విద్యుత్ చార్జీల భారం మోపాలని చూడడం సరికాదని..ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బండిఆత్మకూరు సబ్‌స్టేషన్‌ను ముట్టడించి నిరసన తెలిపారు. అనంతరం ఏడీ సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. నాయకులు రామచంద్రుడు, రత్నమయ్య, డేవిడ్ రాజు, నాగరత్నం, నక్క శ్రీను పాల్గొన్నారు.

విరమించుకోవాలి

ఆత్మకూరు: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ సర్దుబాటు చార్జీల పెంపు ప్రతిపా

బడి, గుడులకు దగ్గర మద్యం షాపులు వద్దు

జూపాడుబంగ్లా: బడి, గుడి, చర్చి, మసీదుల సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే ఆందోళన చేపడుతామని సీపీఐ నాయకుడు రమేష్ బాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎక్సైజ్ సీఐ రామాంజనేయులుకు నాయకులు వినతిపత్రం అందజేశారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని కొన్ని దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేశారని, వాటిని తొలగించకపోతే ఆందోళన చేపడుతామని ఈ సందర్భంగా రమేష్‌బాబు హెచ్చరించారు.

ఒకే నంబర్ ప్లేటుతో మరో కారు

మహానంది: మహానందిలో టీటీడీ వసతి గృహాల వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఓ కారును మహానంది పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. నంద్యాల పట్టణానికి చెందిన కొందరు ఓ కారును తీసుకుని మహానందికి వచ్చారు. అయితే ఆ కారుకు ఉన్న నంబర్ ప్లేటుతో మరో కారు ఉన్నట్లు గుర్తించిన నంద్యాల సీసీఎస్ కమాండ్ కంట్రోల్ పోలీసులు మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన వెంటనే మహానందిలోని టీటీడీ వసతి గృహాల వద్ద ఉన్న కారును గుర్తించి నంద్యాలకు తీసుకెళ్లారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.